

ఎంపీ ఫహీమ్, బల్మూరి వెంకట్‌లను సన్మానించిన నిర్మలాజగ్గారెడ్డి



టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన బల్మూరి వెంకట్‌ను సన్మానిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలో ఉపాధ్యక్షులుగా నియమితులైన ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ ఫహీమ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి సన్మానించారు. హైదరాబాద్‌లోని టీజీఐఐసీ ప్రధాన కార్యాలయంలో ఆమె బుధవారం ఫహీమ్, వెంకట్‌లకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం కోసం ప్రతీ ఒక్కరు సమష్టిగా పనిచేయాలన్నారు. రాబోయే రోజుల్లో రాహుల్‌గాంధీని దేశ ప్రధానమంత్రిగా చేయాలన్న సంకల్పంతో ప్రతీ కార్యకర్త కంకణబద్ధులు కావాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీశ్రేణులు కృషిచేయాలని తెలిపారు. యువకులైన ఎంఏ ఫహీమ్, బల్మూరి వెంకట్‌లకు రాష్ట్ర పార్టీలో ఉపాధ్యక్షులుగా నియమించినందుకు పార్టీ అధినేతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.



టీపీసీసీ ఉపాధ్యక్షుడుగా నియమితులైన ఎంఏ ఫహీమ్‌కు శాలువా కప్పి సన్మానిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి



హుస్నాబాద్‌లోని రేణుకా ఎల్లమ్మతల్లికి వెండి భుజ తొడుగులను అలంకరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మంజుల దంపతులు

చండీహోమంలో పూర్ణహుతిని నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ముగిసిన రేణుకా ఎల్లమ్మ జాతర

వైభవంగా చండీ హోమం

హుస్నాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : నెల రోజుల పాటు జరిగిన హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ జాతర బుధవారంతో ముగిసింది. అమ్మవారి బాషికాలు విప్పడంతో ముగియగా ఈ ఉత్సవానికి మంత్రి పొన్నం ప్రభాకర్, మంజుల దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో చండీ హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు అమ్మవారికి రూ.6.60 లక్షలతో చేయించిన ఆరు కేజీల భుజముల వెండి తొడగులను అలంకరించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

110 మంది జీపీవోలకు అర్హత

- త్వరలో ఆర్డర్ కాపీల అందజేత

సిద్దిపేట కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే ధరణి స్థానంలో భూభారతి పోర్టల్‌ను తీసుకువచ్చింది. ఇక గత ప్రభుత్వం హయాంలో రద్దు చేయబడిన వీఆర్వో, వీఆర్‌ఏల స్థానంలో గ్రామ పరిపాలన అధికారుల(జీపీవో) వ్యవస్థను తీసుకువచ్చేందుకు నిర్ణయించారు. జిల్లాలో 26 మండలాలు, 508 గ్రామ పంచాయతీలు ఉండగా, 396 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. గతంలో వీఆర్వో, వీఆర్‌ఏలుగా పని చేస్తూ ఇతర శాఖల్లో పని చేస్తున్న వారికి ప్రభుత్వం తిరిగి మాతృశాఖకు వచ్చేందుకు అవకాశం కల్పించింది. ఇందు కోసం మే 25న నిర్వహించిన జీపీవో పరీక్షకు 144 మంది వీఆర్వో, వీఆర్‌ఏలు దరఖాస్తు చేసుకోగా, 130 మంది హాజరయ్యారు. అందులో 110 మంది అర్హత సాధించారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే, కలెక్టర్ మనుచౌదరి ఆర్డర్ కాపీలను అందజేయనున్నారు. ఒక్కో జీపీవోకు రెండు నుంచి మూడు గ్రామాల బాధ్యతలను అప్పగించనున్నట్లు తెలిసింది.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- సీపీ డాక్టర్ బి.అనురాధ

సిద్దిపేట క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట క్రైం, జూన్ తీతీ: ఈ నెల 14న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీపీ డాక్టర్ బి.అనురాధ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. చిన్న కేసులతో కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని, రాజీ మార్గం రాజ మార్గమని తెలిపారు. పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు, సిబ్బంది ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చి అవగాహన కల్పించాలని సూచించారు.

'16 నెలలుగా గ్రామ పంచాయతీలకు నిధులు రావడం లేదు. ఇప్పటికే అప్పులు తెచ్చి పెడుతున్నాం. చెత్త తీయకుంటే ప్రజలు ఊరుకోరు. చెత్తను సేకరించే ట్రాక్టర్లలో డీజిల్ పోయించుదామంటే డబ్బులు ఉండవు. పైపులు లీకైనా, స్ట్రీట్ లైటు ఎగిరిపోయినా, బ్లీచింగ్ పౌడర్ అయిపోయినా ఖర్చు పెట్టడానికి చేతిలో రూపాయి బిళ్ల ఉండట్లేదు. ఈ బాధలన్నీ అధికారులకు చెబితే మా చేతుల్లో ఏముందని అంటున్నారు. ఇక ఆర్థిక భారాన్ని మోయలేం' అంటూ పంచాయతీ కార్యదర్శులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ట్రాక్టర్ల తాళం చెవులను మండల అధికారులకు సరెండర్ చేసి చేతులు దులుపుకుంటున్నారు.



ట్రాక్టర్ల తాళాలు సరెండర్ చేస్తున్న మద్దూరు మండల పంచాయతీ కార్యదర్శులు

ట్రాక్టర్లను నడపలేం

చేతులెత్తేసిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు

- ప్రభుత్వం పైసలివ్వదు.. పంచాయతీలకు ఆదాయం లేదు
- 16 నెలలుగా జీపీలకు విడుదల కాని నిధులు
- డీజిల్ పోయించలేక అధికారులకు ట్రాక్టర్ల తాళాలు అప్పగింత
- పైసలు లేకుంటే ఏ పనులు చేయలేమని కార్యదర్శుల వెల్లడి
- క్షేత్రస్థాయి పరిస్థితిపై ముందే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి'



తొగుట మండలం తుక్కాపూర్‌లో డీజిల్‌కు డబ్బులు లేక పక్కనబెట్టిన ట్రాక్టర్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూన్ 11 : సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని మెజారిటీ గ్రామాలకు చెందిన కార్యదర్శులు వినూత్నంగా వ్యవహరించారు. ఇక నుంచి గ్రామాల్లో ఆర్థిక సంబంధిత పనులను తాము చేయలేమని కరాఖండిగా తేల్చి చెబుతూ ఎంపీడీవోలు, ఎంపీవోలకు వినతిపత్రాలు సమర్పించారు. ఇందుకు కార్యదర్శుల రాష్ట్ర జేఏసీ సైతం మద్దతు తెలపడంతో అన్ని మండలాల్లో ఇదే విషయం హాట్‌టాపిక్‌గా మారింది.

విలేజ్ గ్రూపుల్లో మెసేజ్‌లు

ట్రాక్టర్ల తాళం చెవులను అధికారులకు అప్పగించిన అనంతరం ఆయా పంచాయతీల కార్యదర్శులు తమ గ్రామ వాట్సాప్ గ్రూపుల్లో ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఆర్థిక భారం ఉన్నందున ఇకపై చెత్త సేకరించడం తమతో కాదని మెసేజ్‌ల రూపంలో పెడుతున్నారు. తమ బాధను అర్థం చేసుకోవాలని, ఇప్పటికే గ్రామాల కోసం తమ వేతనాలను కూడా త్యాగం చేశామని, అప్పులు తెచ్చి ఖర్చు పెట్టామని ఆవేదన వెల్లగక్కుతున్నారు. చేసిన అప్పులను తీర్చే పరిస్థితి కూడా లేదని వాపోతున్నారు. గ్రామాలను శుభ్రం చేస్తున్న సిబ్బందికి కూడా వేతనాలు చెల్లించే పరిస్థితి లేదని పేర్కొంటున్నారు. మళ్లీ ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యే దాకా చెత్త సేకరించడం, ఆర్థిక పనులు చేపట్టడానికి దూరంగా ఉంటామని, తమకు సహకరించాలని

మిగతా 7వ పేజీలో

గ్రామ పంచాయతీల వివరాలు

జిల్లా	గ్రామాలు
సంగారెడ్డి	633
సిద్దిపేట	508
మెదక్	492

తుదిదశకు కొమురవెల్లి హాల్ట్ స్టేషన్ పనులు

- స్టేషన్ బిల్డింగ్, ప్లాట్‌ఫామ్‌లు పూర్తి

కొమురవెల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జున స్వామి భక్తులకు, పరిసర ప్రాంత ప్రజలకు త్వరలోనే రైల్వే హాల్ట్ స్టేషన్ అందుబాటులోకి రానుంది. దసరా నాటికి ప్రారంభమే లక్ష్యంగా అధికారులు, కాంట్రాక్టర్ నిర్మాణ పనులను వేగవంతం చేసి తుదిదశకు తీసుకువచ్చారు. గత సంవత్సరం ఫిబ్రవరిలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్, రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్‌తో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ రైల్వేస్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

పూర్తయిన నిర్మాణాలు

ప్రస్తుతం రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ప్లాట్‌ఫామ్‌లు, ప్రయాణికులు వేచి ఉండే గది, టికెట్ కౌంటర్, స్టేషన్ మాస్టర్ గది, తాగునీటి కుళాయిలు, మరుగుదొడ్ల నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. ఇంకా కొన్ని చిన్న చిన్న పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ రైల్వేస్టేషన్ మల్లికార్జున స్వామి ఆలయానికి అతి చేరువలో, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంది.

తీరనున్న రవాణా కష్టాలు

కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివస్తుంటారు. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి ఎంజీబీఎస్, జేబీఎస్ బస్‌స్టేషన్లకు చేరుకొని, అక్కడి నుంచి బస్సుల్లో రాజీవ్ రహదారిపై ఉన్న కొమురవెల్లి కమాన్‌కు వచ్చి, ఆటోలలో దేవస్థానానికి చేరుకుంటున్నారు. కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభం అయితే హైదరాబాద్‌లోని రైల్వే స్టేషన్ల నుంచి కొమురవెల్లికి సులువుగా చేరుకోవచ్చు. దీనివల్ల భక్తులకు, ప్రజలకు సమయం, డబ్బు ఆదా అవుతాయి. ఈ రైల్వేస్టేషన్ ప్రారంభంతో పరిసర ప్రాంత ప్రజలతో పాటు, మల్లన్న భక్తులకు రవాణా కష్టాలు తీరనున్నాయి.



పూర్తయిన రైల్వేస్టేషన్ భవనం

శిథిలం.. పదిలమేనా?

మున్సిపాలిటీల్లో ప్రమాదకర ఇళ్లపై సర్వే... యజమానులకు నోటీసులు



దుబ్బాకలో సగం కూలిన ఇల్లు

దుబ్బాక, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లు కూలి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పాడుబడిన, ప్రమాదకరమైన ఇళ్లను కూల్చివేయాలని నిర్ణయించింది. మున్సిపాలిటీల పరిధిలోని వార్డుల వారీగా సర్వే చేసి, యజమానులకు నోటీసులు ఇవ్వాలని రాష్ట్ర పురపాలక శాఖ ఇటీవల ఆదేశాలు జారీ చేసింది.

ఐదు మున్సిపాలిటీల్లో 432 ఇళ్లు

జిల్లాలోని సిద్దిపేట, దుబ్బాక, చేర్యాల, హుస్నాబాద్, గజ్వేల్ మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా వారం రోజులుగా సర్వే నిర్వహిస్తున్నారు. పూర్తిగా పాడుబడిన, గోడలు కూలిన పెంకుటిళ్లను గుర్తించారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో సుమారు 432 ఇళ్లు పూర్తిగా శిథిలావస్థలో ఉన్నట్టు గుర్తించిన అధికారులు, ఆయా యజమానులకు నోటీసులు జారీ చేయనున్నారు. పురాతన కాలం నాటి ఇళ్లను కూడా గుర్తించి వారికి నోటీసులు అందిస్తారు.

వంద రోజుల ప్రణాళికలో చర్యలు

మొదట నోటీసులు అందుకున్న యజమానులు తమ ఇళ్లకు మరమ్మతులు చేసుకోవాలని సూచిస్తారు. దీని కోసం టౌన్‌ప్లానింగ్ అధికారులు లేదా సివిల్ ఇంజనీర్ల ద్వారా స్ట్రక్చర్ స్టెబిలిటీ సర్టిఫికెట్‌ను అందించాలి. ఈ పాత భవనాల యజమానుల నుంచి వచ్చే స్పందనను బట్టి, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వంద రోజుల ప్రణాళికలో భాగంగా పురపాలక అధికారులు వాటిని కూల్చివేసి, చదును చేస్తారు.

ప్రత్యామ్నాయ మార్గాలు లేక అవస్థలు

దుబ్బాకతో పాటు చాలా పురపాలక సంఘాల్లో పెంకుటిల్లు ప్రమాదకరంగా మారాయి. దుబ్బాకలోని విలీన గ్రామాలైన

మిగతా 8వ పేజీలో

విద్యార్థులకు వరం..

పాలిటెక్నిక్

చంద్లాపూర్ కళాశాలలో వెటర్నరీ డిప్లొమాలో సీట్ల భర్తీ 7

మూడో శనివారం బ్యాగ్‌లెస్ డే

7

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- కలెక్టర్ మనుచౌదరి

కొమురవెల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. కొమురవెల్లి మండలంలోని కిష్టంపేట గ్రామంలో జరుగుతున్న భూభారతి రెవెన్యూ సదస్సును కలెక్టర్ మనుచౌదరి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, విచారణ పూర్తి అయిన దరఖాస్తుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ పలువురు దరఖాస్తుదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ జి.దివ్య, నాయబ్ తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ శ్రీనివాస్ ఉన్నారు.



కిష్టంపేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

యాంటీ నార్కోటిక్ బ్యూరో పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేట కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో రూపొందించిన మత్తు పదార్థాల నివారణ పోస్టర్‌ను బుధవారం కలెక్టర్ మనుచౌదరి, యాంటీ నార్కోటిక్ బ్యూరో హైదరాబాద్ డీఎస్పీ పుష్పన్ కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో డీఎస్పీ పుష్పన్ కుమార్, మనుచౌదరిని కలిసి డ్రగ్స్ గంజాయి ఇతరత్రా మత్తు పదార్థాలు వినియోగాన్ని అంతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలుపై క్లుప్తంగా వివరించారు.



పాఠశాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

సెలవులకు టాటా

నేటి నుంచి తెరుచుకోనున్న బడులు

సిద్దిపేట కల్చరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి బడి గంట మోగనుంది. దాదాపు 45 రోజుల వేసవి సెలవుల తర్వాత విద్యార్థులు పాఠశాల బాట పట్టనున్నారు. ఇప్పటికే ప్రైవేట్ పాఠశాలలు అడ్మిషన్ డ్రైవ్ అని చేపడుతుంటే ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం బడులను శుభ్రం చేయించారు. మొదటి రోజు పాఠశాలలను అందంగా ముస్తాబు చేసి విద్యార్థులకు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ యూనిఫామ్‌లను అందజేసేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకున్నది.



పాఠశాల పక్కనే ఇలా!



నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభమవుతున్నాయి. కానీ, ఎన్సాన్‌పల్లి హైస్కూల్ సమీపంలోని మురుగు కాలువలో వ్యర్థాల కోసం కుక్కలు పందులు గుంపులుగా సంచరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. అవి పిల్లలపై దాడి చేసే అవకాశం లేకపోలేదని భయాందోళన వ్యక్తమవుతున్నది.

- జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జూన్ 11

అనారోగ్యానికి గురై.. మద్యానికి బానిసై

● నిజాంపేటలో వ్యక్తి ఆత్మహత్య



శ్రీను(ఫైల్)

నిజాంపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య కారణాల వల్ల మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిజాంపేట మండల కేంద్రానికి చెందిన కానుగంటి శ్రీను(48) మండల మిషన్ భగీరథ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నేళ్లుగా ఫిడ్స్‌తో బాధపడుతుండేవాడు. ఆ బాధ భరించలేక మద్యానికి బానిసయ్యాడు. ఫిడ్స్ వ్యాధితో పాటు అనారోగ్య సమస్యలతో మనస్తాపానికి గురైన శ్రీను జీవితంపై విరక్తి చెంది బుధవారం ఉదయం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

కాంట్రాక్టర్ దౌర్జన్యం

● సమాచారం లేకుండా మట్టి రోడ్డు వేసిన వైనం
● అడ్డుకున్న రైతులు

మనోహరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సమాచారం లేకుండా పొలాల గుండా కాంట్రాక్టర్ మట్టి రోడ్డు పోయడంతో.. ఆయా పనులను రైతులు అడ్డుకున్నారు. మనోహరాబాద్, తూప్రాన్ మండల పరిధిలోని ఘనపూర్, దర్మారాజ్‌పల్లి, కోనాయపల్లి శివారులో గల ప్రభుత్వ భూములను ప్రభుత్వం తీసుకుని పరిశ్రమలకు కేటాయించింది. అయితే దారి కోసం ఘనపూర్ నుంచి కోనాయపల్లి శివారు వరకు సుమారు 24 ఫీట్ల వెడల్పులతో రోడ్డు మంజూరైందని పీఆర్ఏఈ మధుసూదన్ తెలిపారు. సదరు కాంట్రాక్టర్ రైతులకు సమాచారం ఇవ్వకుండా పొలాలకు వెళ్లే దారిలో మట్టిపోశాడు. ఈ పనులను రైతులు అడ్డుకున్నారు. ఇదిలా ఉండగా ఉమ్మడి మండల పంచాయతీ పీఆర్ఏఈ మధుసూదన్‌ను ఈ విషయమై వివరణ కోరగా.. తమకు తెలియకుండానే పనులు చేపట్టారని తెలిపారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని రైతులు కోరారు.

కుల ధ్రువీకరణ పత్రాలు అందేలా చూడాలి

● అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు మన్నె కులస్థుల వినతి

సంగారెడ్డి రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కుల ధ్రువీకరణ పత్రాలు త్వరగా అందేలా చూడాలని మన్నె కులస్థులు కోరారు. బుధవారం ఈ విషయమై అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ వర్గీకరణ జరగక ముందు మన్నె కులస్థులు కొందరు మన్నె కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకోలేకపోయారని అన్నారు. మన్నె కుల సర్టిఫికేట్లు త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుదయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట్, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మల్లేశం, శివకుమార్, సహాయ కార్యదర్శి రంగయ్య, భీమ్‌రావు తదితరులు ఉన్నారు.
ఇంటర్‌లో నమోదు శాతాన్ని పెంచాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఇంటర్ బోర్డు అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల సమాచారాన్ని డీఐఈవో అధికారులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు చేరవేయాలని సూచించారు. కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అక్షయపాత్ర ఫౌండేషన్ నుంచి ఎండీఎం పథకం కచ్చితంగా నమోదును మెరుగు పరుస్తుందని వారు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి గోవింద్‌రామ్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మన్నె కుల సంఘం నాయకులు

అక్రమంగా మట్టి తరలింపు

● అడ్డుకోబోయిన ఇరిగేషన్ సిబ్బందిపై దాడికి యత్నం
● ఫిర్యాదు చేస్తే పట్టించుకోని పోలీసులు
● ఆలస్యంగా వెలుగులోకి ఘటన

నర్సాపూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్ పరిధిలోని చెరువు నుంచి శివ్వంపేట మండలం కొత్తపేట సమీపంలోని ఇటుక బట్టీలకు మట్టిని అక్రమంగా తరలిస్తుండగా అడ్డుకున్న ఇరిగేషన్ సిబ్బందిపై దాడికి యత్నించారు. ఈ సంఘటన నాలుగురోజుల క్రితం జరగ్గా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నర్సాపూర్ నీటిపారుదల సబ్ డివిజన్ కార్యాలయంలో పనిచేసే యాదగిరి, నర్సింలు, సత్యనారాయణ, శ్రీనివాస్ కలిసి అధికారులు ఆదేశాల మేరకు తుజాల్‌పూర్ నుంచి శివ్వంపేట మండలం కొత్తపేట సమీపంలోని ఇటుక బట్టీలకు మట్టి తరలిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు వెళ్లారు. అయితే తుజాల్‌పూర్ నుంచి ట్రాక్టర్‌లో మట్టిని ఇటుకబట్టీలకు తరలిస్తున్న వాహనాలను అడ్డుకోబోయారు. దీంతో సదరు వ్యాపారులు సిబ్బంది ఐడెంటీ కార్డులు, సెల్‌ఫోన్లు లాక్కొని చంపేస్తామంటూ బెదిరించి, దాడికి యత్నించారు. భయంతో అక్కడి నుంచి బయటకు వచ్చిన సిబ్బంది మరుసటి రోజు నర్సాపూర్ పోలీసులను ఆశ్రయించారు. వారు శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పడంతో పాటు, తాము ప్రభుత్వ సిబ్బంది అని చూడకుండా ఎస్‌ఐ ఇష్టానుసారంగా మాట్లాడి ఫిర్యాదు తీసుకోలేదని ఇరిగేషన్ సిబ్బంది బుధవారం నర్సాపూర్ ఐబీ కార్యాలయం వద్ద విలేకరులతో వాపోయారు. ఈ విషయమై ఏఈ మణిభూషన్‌ను సంప్రదించగా... తాను సెలవులో ఉండటం వల్ల వచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామానికి వెళ్లి చూడాలని సిబ్బందికి సూచించామని, ఆ మేరకు వారు వెళ్తే దాడికి యత్నించారని తెలిపారు. తాను బుధవారం కార్యాలయానికి రాగా విషయం చెప్పారని, తమ సిబ్బంది ఫిర్యాదు చేయడానికి వెళ్తే పోలీసులు కూడా ఈ విషయం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు.

కిష్టారెడ్డిపేటలో అక్రమ అంతస్తులపై కొరడా

● కాంప్రెషర్లతో స్లాబ్‌లను తొలగించిన సిబ్బంది

అమీన్‌పూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో అక్రమ అంతస్తులు వేసిన భవనాలపై మున్సిపల్ సిబ్బంది, టౌన్‌ప్లానింగ్ విభాగం చర్యలకు ఉపక్రమించింది. జీ ప్లస్-2 అనుమతులు తీసుకుని ఆపైన అంతస్తులు వేస్తున్న వారికి ఇటీవలే నోటీసులు జారీచేశారు. మున్సిపల్ అధికారుల ఆదేశాలను ధిక్కరిస్తూ అంస్తులు వేసిన వాటిని గుర్తించి బుధవారం సిబ్బంది కూల్చివేతలు ప్రారంభించారు. మొత్తం మూడు భవనాలకు నోటీసులు జారీచేసి కాంప్రెషర్లతో స్లాబ్‌లను కూల్చివేశారు. కూల్చివేతలను అమీన్‌పూర్ మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ అధికారి పవన్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ అంతస్తులను ఉపేక్షించేంది లేదన్నారు. శివారు పంచాయతీలు మున్సిపాలిటీలో విలీనం జరిగిన తరువాత అక్రమ భవనాలపై స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశామన్నారు. అక్రమ అంతస్తులు వేసిన అపార్ట్‌మెంట్లలో రిజిస్ట్రేషన్లు సైతం జరగవని కొనుగోలకు స్పష్టం చేస్తున్నామన్నారు. మున్సిపల్ అనుమతులు లేకుండా నిర్మించిన ఫ్లాట్లకు బ్యాంకులు రుణాలు సైతం జారీ చేయకూడదని సూచిస్తున్నామని తెలిపారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

దుబ్బాక, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామ శివారులో మంగళవారం రాత్రి జరిగింది. దుబ్బాక మున్సిపల్ ధర్మాజీపేట గ్రామానికి చెందిన దివిటి నల్గొండ(38) కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధిని నయం చేయించుకునేందుకు వైద్య ఖర్చులతో పాటు ఇళ్లు గడిచేందుకు లక్షల్లో అప్పులు చేశాడు. అవి తీర్చే మార్గం లేక మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయిన నల్గొండ హబ్షీపూర్ శివారులోని విద్యుత్ కేంద్రం సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

సికింద్రాబాద్‌లో మహిళ అదృశ్యం



లలిత(ఫైల్)

అడ్డగుట్ట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : చెన్నై నుంచి సికింద్రాబాద్‌కు వచ్చిన ఓ మహిళ అదృశ్యమైంది. ఈ సంఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ ప్రాంతానికి చెందిన అత్తమామలు విశ్వనాథం, లక్ష్మితో లలిత ముగ్గురు కలిసి బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చెన్నై రైలులో దిగారు. సికింద్రాబాద్ నుంచి మెదక్ వెళ్లడానికి ముగ్గురు కలిసి నడుచుకుంటూ రేతిఫైల్ బస్టాండు వైపు వెళ్తున్నారు. ముగ్గురు నడుచుకుంటూ వెళ్తుండగా.. రేతిఫైల్ బస్టాండులో అత్తమామ ముందు వెళ్లిపోయారు. కోడలు లలిత వెనుక వస్తుందని అనుకుని పొరపాటుపడ్డారు. తీరా వెనుక చూస్తే లలిత కనిపించకపోవడంతో మామ తన కొడుకు నగేష్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చాడు. వెంటనే సికింద్రాబాద్‌లో లలిత కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో అత్తమామతో పాటు భర్త కలిసి గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు కింద నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు లలితకు మతిస్థిమితం లేదని పోలీసులు భావిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



పరమేశ్వర్(ఫైల్)

నంగునూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన నంగునూరు మండలం ఖైసంపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. రాజగోపాలపేట పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ మహమ్మద్ అసిఫ్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఖాతా పరమేశ్వర్(26)కు చిన్నతనంలోనే తల్లి దండ్రులు చనిపోయారు. చెల్లితో పాటు పరమేశ్వర్ నర్మెట్ట గ్రామంలోని అమ్మమ్మ గారి ఇంటి వద్ద ఉంటున్నాడు. చెల్లికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఇంట్లో ఆర్థిక పరిస్థితి బాగాలేదు. పెళ్లి ఎలా జరుగుతుందోనని తరచూ బాధపడేవాడు. ఈ క్రమంలో 9న ఉదయం అమ్మమ్మ వాడే బీపీ మాత్రలను మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు సిద్దిపేట జీజీహెచ్‌కు, అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు పరమేశ్వర్ పెదనాన్న చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

● సంగారెడ్డి జిల్లా ఉద్యోగ జేఏసీ చైర్మన్ జావిద్‌అలీ

సంగారెడ్డి అర్బన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సంగారెడ్డి జిల్లా ఉద్యోగ జేఏసీ చైర్మన్ జావిద్‌అలీ అన్నారు. బుధవారం సంగారెడ్డిలో నిర్వహించిన నాల్గవ తరగతి ఉద్యోగుల స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాల్గవ తరగతి ఉద్యోగులు ప్రభుత్వ యంత్రాంగానికి స్థంభం లాంటివారన్నారు. ఐక్యంగా ఉండి ఉద్యోగుల సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు దాస్యనాయక్ మాట్లాడుతూ నాల్గవ తరగతి ఉద్యోగులకు సంబంధించిన సమస్యలపై రాష్ట్ర స్థాయిలో నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. జిల్లా అధ్యక్షుడు షరీఫ్, కార్యదర్శి నాగరాజు అధ్వర్యంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖాదర్, కోశాధికారి ధన్‌రాజ్, టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి రవి, అసోసియేట్ అధ్యక్షుడు కసిని శ్రీకాంత్, వెంకటరెడ్డి, కోశాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా విద్యాశాఖ అకాడమిక్ క్యాలెండర్

మూడో శనివారం బ్యాగ్‌లెస్ డే



- రోజూ ఐదు నిమిషాలు యోగా, ధ్యానం
- 30 నిమిషాలు పుస్తక పఠనం
- నేటి నుంచి బడులు ప్రారంభం
- నాణ్యమైన విద్యకు పకడ్బందీ ప్రణాళిక

కొండపాక, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : సుమారు 49 రోజుల సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం ప్రారంభమవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతాన్ని పెంచడం కోసం వేసవి శిబిరాలు, బడిబాట తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఈ సంవత్సరంలో నాణ్యమైన విద్య కోసం విద్యాశాఖ పకడ్బందీగా రూపొందించిన అకాడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులను తీర్చిదిద్దడం కోసం విద్యాబోధనతోపాటు కరికులం ఆక్టివిటీస్‌కు ప్రాధాన్యం ఇస్తూ క్యాలెండర్ పొందుపరిచారు. ఈ విద్యా సంవత్సరంలో 230 రోజుల పనిదినాలను నిర్ణయించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా సిలబస్‌ను పూర్తి చేయడానికి గడువు నిర్ణయించింది. 90 శాతం విద్యార్థులు హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించింది. పాఠశాల ప్రారంభం నుంచి చివరి రోజు వరకు 90 శాతం హాజరయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించింది.

ఏకాగ్రత పెంచేందుకే యోగా..

విద్యార్థుల్లో ఏకాగ్రతను పెంచడంతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను పెంపొందించేందుకు ప్రార్థనా సమయంలో ప్రతిరోజూ ఐదు నిమిషాలపాటు యోగా, ధ్యానం కార్యక్రమాలు నిర్వహించాలని క్యాలెండర్‌లో పేర్కొన్నారు. అలాగే ప్రతిరోజూ 30 నిమిషాలు పిల్లలను చదివించాలని సూచించారు. పిల్లలు చదవడంలో తడబాటు లేకుండా ఉండడం కోసం భావన, కథల పుస్తకాలు, దినపత్రికలు చదివించాలని అధికారులు భావిస్తున్నారు.

సిలబస్ పూర్తికి గడువు

గతంలో ఎన్నడూ లేనివిధంగా సిలబస్ పూర్తిచేసేందుకు గడువు విధించడం విశేషం. పదో తరగతి సిలబస్‌ను జనవరి 10లోగా పూర్తి చేయాలి. అలాగే 1వ నుంచి 9వ తరగతి వరకు ఫిబ్రవరి 28లోపు పూర్తి చేయాలి. గతంలో మాదిరిగానే ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 నుంచి 4 గంటల వరకు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు నడుస్తాయి.

బడి అంటే భయం పోగొట్టేలా..

ప్రతి మూడో శనివారం నో బ్యాగ్ డే నిర్వహించాలని అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. ఆ రోజు విద్యార్థులకు ఆహ్లాదకరమైన విషయాలు అందిస్తారు. బడి అంటే భయం లేకుండా చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశం. ప్రైవేటు పాఠశాలల్లో లాగే ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా వచ్చే ఏప్రిల్ 23వ తేదీ చివరి పనిదినంగా నిర్ణయించింది.



చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల

విద్యార్థులకు వరం.. పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సు

- పాలిసెట్ ర్యాంకుల ద్వారా సీట్ల భర్తీ
- ఈనెల 24 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం

చిన్నకోడూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పూర్తయిన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వెటర్నరీ (పశుసంవర్ధక) పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సు వరంగా మారింది. రెండేళ్ల కోర్సు పూర్తిచేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయంలో పరిధిలో రాష్ట్రంలో మూడు కళాశాలలు ఉన్నాయి. కరీంనగర్, మహబూబ్‌నగర్‌లో ఒక్కొక్కటి ఉండగా.. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ గ్రామ శివారులో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల ఉంది.

కళాశాలలో సీట్ల వివరాలు...

ఈ కళాశాలలో 33 సీట్లు ఉన్నాయి. పాలిసెట్ (2025)లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా సీట్లను కౌన్సిలింగ్ పద్ధతిలో కేటాయిస్తారు. ఈ కళాశాల గ్రామ శివారులో పచ్చని ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంటుంది. విద్యార్థులకు ప్రత్యేకమైన హాస్టల్ భవనాలు ఉన్నాయి.

దరఖాస్తు చేసుకొండిలా..

ఈ ఏడాదిగాను వెటర్నరీ డిప్లొమా కోర్సుకు సంబంధించి నోటిఫికేషన్ ఈనెల 3న విడుదలైంది. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తెలంగాణకు చెందిన వారై ఉండాలి. పదో తరగతి ఉత్తీర్ణులై, టీజీ పాలిసెట్ (2025) ఏం బీపీసీలో క్వాలిఫై అయి ర్యాంకు పొంది ఉండాలి. వెబ్‌సైట్ (హెచ్‌టీటీపీ://టీఎస్‌వీయూ.ఈడీయూ.ఇన్) నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. పూర్తి వివరాలు నింపి, ఫారంతో పాటు సంబంధిత ధ్రువపత్రాలు, రూ.900 (జనరల్ కేటగిరి, ఇతరులు) రూ.450 (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు) అప్లికేషన్ ఫీజు ఎస్‌బీఐ కలెక్ట్ ద్వారా చెల్లించాలి. ఫీజు చెల్లించిన కాపీని దరఖాస్తు ఫారంతో జతచేసి ఈనెల 24 వరకు రిజిస్ట్రార్, పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, పరిపాలన కార్యాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్ 500030 పేరున రిజిస్టర్/స్పీడ్ పోస్టులో అందేటట్లు పంపించాలి.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



ఈ కోర్సు పూర్తిచేసినవారికి ప్రభుత్వ పశుసంవర్ధక శాఖలో ఉద్యోగి (వెటర్నరీ అసిస్టెంట్)గా, లేదా ప్రైవేట్ క్లినిక్‌లలో, కోళ్ల పరిశ్రమల హ్యాచరీస్‌లలో, బ్రీడర్ ఫ్రౌల్ట్రీ ఫామ్‌లు, డైరీ, గొర్రెలు, మేకల ఫామ్‌లలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మరిన్ని వివరాలకు నంబరు (9100956355)ను సంప్రదించవచ్చు.

- డాక్టర్ పరశురాములు, కళాశాల ప్రిన్సిపాల్

పౌష్టికాహారం..నాణ్యమైన విద్య



జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాలలో చిన్నారులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య
- పిల్లల సంఖ్య పెరిగేలా కార్యక్రమాలు
- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట'

జగదేవ్‌పూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మూడు నుంచి ఐదేళ్ల పిల్లలు ఎదిగేందుకు పౌష్టికాహారం, ఆటపాటలతో నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. చిన్నారులకు అర్థమయ్యేలా పూర్వ ప్రాథమిక విద్యాబోధనను అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్నది. ఇందుకుగానూ జిల్లావ్యాప్తంగా 10 నుంచి 17 వరకు 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' అనే కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోంది.

కొనసాగుతున్న 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట'

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' కొనసాగుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల అలంకరణ, తల్లిదండ్రులు పిల్లలతో సెల్ఫీ దిగడం, అంగన్‌వాడీ స్థాయిలో తల్లులు కమిటీలు, గ్రామైక్య సంఘాలు, మహిళా స్వయం సహాయక సంఘాలు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించి అంగన్‌వాడీలో కల్పించే సౌకర్యాలు, విద్యాబోధన తదితర సౌకర్యాల గురించి ఇంటింటికి తిరిగి వివరిస్తున్నారు. పాఠశాల పూర్వ విద్య పూర్తిచేసిన పిల్లలకు ధ్రువీకరణ పత్రాలను అందజేయడం, ఐదేళ్లు పైబడిన పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పించడం వంటివి చేపడుతున్నారు. ఆయా కార్యక్రమాల్లో తల్లిదండ్రులతో పాటు తాతలు, అమ్మమ్మలు, నాన్నమ్మలు, గ్రామస్థులు, మాజీ ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తున్నారు. 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట'లో భాగంగా ఆరోగ్యంగా ఉన్న పిల్లల తల్లిదండ్రులకు అవార్డులు ఇవ్వడం, సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. దీనికి అనుగుణంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది గ్రామాల్లో ర్యాలీలు నిర్వహిస్తూ విస్తృత ప్రచారం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల నమోదు పెరిగేలా ఐసీడీఎస్ సిబ్బంది పనిచేస్తున్నారు. జిల్లాలో 1,150 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. ప్రతి కేంద్రంలో 20 నుంచి 30 శాతం విద్యార్థుల సంఖ్య పెరిగేలా కృషి చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యాబోధన బాగా జరుగుతుంది. పిల్లలకు అర్థమయ్యే విధంగా ఫొటోలు, ఆటలతో విద్య నేర్పిస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాం. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి.. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి.

- సరిత, ఐసీడీఎస్ సీడీపీవో

ట్రాక్టర్లను నడపలేం

5వ పేజీ తరువాయి

గ్రామాల్లోని అన్ని వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేస్తున్న పరిస్థితి కనిపించింది.

ఈ పనులపై ప్రభావం

కార్యదర్శులు తీసుకున్న ఈ నిర్ణయంతో చాలా గ్రామాల్లో పనులపై ప్రభావం పడుతుంది. ట్రాక్టర్లను పక్కనబెట్టడంతో చెత్త సేకరణ పూర్తిగా నిలిచిపోనున్నది. అదే విధంగా తాగునీటి ట్యాంకరు నిర్వహణ కష్టమే అవుతుంది. ఇంటింటా తాగునీటిని సరఫరా చేసే మోటార్లకు మరమ్మతులు తలెత్తితే ఇబ్బందులు తప్పవు. పైపులైన్ లీకేజీలు కూడా పెద్ద సమస్యగానే మారుతాయి. ఇక వర్షాకాలం కావడంతో బ్లీచింగ్ పౌడర్ ఎప్పటికప్పుడు చల్లాల్సి ఉంటుంది. పౌడర్‌తోపాటు పారిశుధ్య సామగ్రిని కొనుగోలు చేయాలంటే నిధులు లేవు. ఈ సీజన్‌లో వీధి దీపాలు అత్యవసరం. స్ట్రీట్ లైట్లు వెలగకుంటే చిమ్మ చీకట్లలో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వీధి దీపాల నిర్వహణ కూడా ఆర్థిక భారమే. ఇక గ్రామపంచాయతీ కార్యాలయ నిర్వహణ ఖర్చులూ ఉంటాయి.

రోగాల సీజన్‌లో చెత్తకంపు

నేటి నుంచి చెత్త సేకరణను నిలిపివేస్తామని పంచాయతీ కార్యదర్శులు ప్రకటించడంతో గ్రామాల్లో చెత్త కంపు తలెత్తనున్నది. ఏ రోజు చెత్త ఆ రోజు తొలగించకుంటే దోమలు ప్రబలి రోగాలు వ్యాపిస్తాయి. పైగా ఇది వర్షాకాలం కావడంతో వ్యాధుల ప్రభావం అధికంగా ఉంటుంది. చెత్త సేకరణపై కార్యదర్శులు తీసుకున్న కఠిన నిర్ణయంపై ఉన్నతాధికారులు ఎలాంటి ఆలోచన చేస్తారో వేచి చూడాలి. కాగా గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి' పలు కథనాలను ప్రచురించింది. ట్రాక్టర్లలో డీజిల్ పోయించలేక పంచాయతీ కార్యదర్శులు పడుతున్న ఇబ్బందుల గురించి ముందుగానే హెచ్చరించడం జరిగింది. అదే విధంగా కార్యదర్శుల వద్ద డబ్బులు లేక ప్రజలే సొంతంగా ఖర్చు చేసుకుంటున్న పరిస్థితిని సైతం 'ఆంధ్రజ్యోతి'లో ప్రస్తావించాం. ఏదేమైనప్పటికీ తాజా పరిణామాలతో జిల్లా అధికార యంత్రాంగం తర్జనభర్జన పడుతోంది. కార్యదర్శుల చర్యలపై ఒక నిర్ణయానికి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఖైదీలకు భరోసా కల్పించేలా జైళ్లశాఖ సంస్కరణలు

- ఉన్నతి కార్యక్రమాల ద్వారా ఖైదీల జీవితాల్లో వెలుగులు
- ఖైదీల్లో మార్పు కలిగించేలా మానసిక శిక్షణా కార్యక్రమాలు
- జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా



కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలు వద్ద జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రాకు గౌరవ వందనం చేస్తున్న జైలు సిబ్బంది

కంది, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : క్షణికావేశంలో చేసిన తప్పులకు కృంగిపోతున్న ఖైదీలకు జైళ్లశాఖ చేపడుతున్న పలు సంస్కరణలు వారు మళ్లీ సమాజంలో నిలదొక్కుకునేందుకు భరోసా కల్పిస్తున్నాయని రాష్ట్ర జైళ్ల, సంస్కరణల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్యమిశ్రా అన్నారు. బుధవారం కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలును, సంగారెడ్డిలోని పురాతన జైలును ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి కేంద్ర కారాగారంలో ఖైదీల వసతులు, వారికి అందించే ఆహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. జైలులోపల ఫ్యాక్టరీలో నెలకొల్పబడుతున్న ఫర్నిచర్ పరిశ్రమ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జైలు ఫ్యాక్టరీలో వివిధ పనుల్లో శిక్షణ పొందుతున్న ఖైదీల గురించి, వారికి కోసం ఏర్పాటు చేసిన శిక్షణల గురించి తెలుసుకున్నారు. త్వరలో సెంట్రల్ జైలులో ఏర్పాటుకాబోతున్న డిఎడిక్షన్ సెంటర్ గురించి జైలు అధికారులకు పలు సూచనలు చేశారు. ఖైదీలకు కేటాయించిన లైబ్రరీని సందర్శించారు. అనంతరం డీజీ సౌమ్యమిశ్రా జైల్లో ఉన్న ఖైదీలతో ముఖాముఖిగా ముచ్చటించారు. ఖైదీల బాగోగుల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐజీ ఎన్.మురళీబాబు, ఎస్పీ పరితోజ్ పంకజ్, కేంద్ర కారాగార పర్యవేక్షణ అధికారి సంతోష్‌కుమార్ రాయ్, డిప్యూటీ సూపరింటెండెంట్ దండా భరత్, ఇతర కారాగార అధికారులు, మినిస్టీరియల్ స్టాఫ్, కారాగార వైద్యాధికారులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం



ఎండోమెంట్ కమిషనర్ కార్యాలయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సురేఖకు క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

వర్గల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ధూప దీప నైవేద్య అర్చకుల సంక్షేమనిధికి నిధులు పెంపొందిస్తూ, అర్చకులకు మేలు చేస్తున్న జీవోను అమలు చేసినందుకు సిద్దిపేట జిల్లా ధూప దీప నైవేద్య అర్చకులు సంఘం అధ్యక్షుడు నందబాలశర్మ, ప్రధాన కార్యదర్శి జంగం వీరభద్రయ్య ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ ఎండోమెంట్ కమిషనర్ కార్యాలయానికి జిల్లా నుంచి 50 మంది అర్చకులతో తరలివెళ్లారు. కమిషనర్ కార్యాలయం వద్ద అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ్‌శర్మ నేతృత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నందబాలశర్మ మాట్లాడుతూ అర్చకుల సంక్షేమానికి కృషిచేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు. అర్చకుల సంక్షేమానికి పాటు పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ముందుందు ఎంతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర కన్వీనర్ నందనం హరికిషన్ శర్మ, శ్రీరంగం గోపి కృష్ణమాచార్యులు, వివిధ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' లిస్ట్‌లో పేరు తొలగించారని..

- యువకుడి ఆత్మహత్యాయత్నం
- అప్పుచేసి గోడల వరకు ఇంటి నిర్మాణం
- ప్రొసీడింగ్స్‌లో పేరు లేకపోవడంతో ఘాతుకం



బాధితుడు అశోక్

రామాయంపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల జాబితాలో పేరు తొలగించారని ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. గ్రామసభలో పేరొచ్చినా.. ప్రొసీడింగ్స్‌లో తొలగించడంతో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధి కాట్రియాలలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎరుకల అశోక్ ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాడు. గ్రామ సభలో అతని పేరును ప్రకటించారు. ఇక తనకు ఇందిరమ్మ ఇల్లు వస్తుందనే నమ్మకంతో అప్పులు చేసి ఇంటి నిర్మాణం ప్రారంభించాడు. ఇల్లు గోడల వరకు పూర్తయింది. అయితే, ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల ప్రొసీడింగ్స్‌లో అతని పేరు లేకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఇక జీవితంలో తన సొంతింటి కల నెరవేరదని భావించి, చేసిన అప్పు తీరే మార్గం కనిపించక ఆదివారం రాత్రి ఇంట్లో ఉన్న పత్తి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే రామాయంపేట ఆస్పత్రికి, అక్కడి నుంచి మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అశోక్ కోలుకుంటున్నాడు. అయితే, సర్వే చేసిన అధికారులు అశోక్‌కు ఇల్లు మంజూరు అయిందని చెప్పడం, చివరకు జాబితాలో పేరు లేకపోవడంతో మనస్థాపం చెందినట్లు అతని తల్లి పోచవ్వ ఆరోపించింది. అశోక్‌కు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

బీఆర్ఎస్ అంటేనే బందిపోటు రాష్ట్ర సమితి

- కేసీఆర్ కుటుంబం పక్కా 420 ఫ్యామిలీ
- కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు ధ్వజం

మెదక్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలిస్తోందని విమర్శిస్తున్న బీఆర్ఎస్ నేతలు అసలు తామున్న పార్టీ బందిపోటు రాష్ట్ర సమితి అని తెలుసుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు నిప్పులు చెరిగారు. బుధవారం మెదక్ పట్టణంలో నిర్వహించిన జైభీమ్, జై బాపూ, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మిగిల్చింది కేసీఆర్ అని విమర్శించారు. ప్రస్తుతం దాన్ని సరిచేసుకుంటూ, పేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని, అసలు కేసీఆర్ ఫ్యామిలీనే ఓ 420 కుటుంబమని ఘాటుగా విమర్శించారు. లిక్కర్ కేసులో జైలుకెళ్లింది కేసీర్ తనయ ఎమ్మెల్సీ కవిత కాదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అంటేనే బందిపోటు రాష్ట్ర సమితిగా పేరొందిందని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో దోచుకున్న సొమ్మంతటినీ కక్కిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం దిశగా పయనిస్తోందని, అందుకు నిదర్శనం మంత్రివర్గ కూర్పు, పీసీసీ పదవులూ తార్కాణం అని తెలిపారు. సీఎం రేవంత్ పథకాలతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. మోదీ సర్కార్ కార్పొరేట్ సంస్థలకు తొత్తుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని మార్చే కుట్రకు పాల్పడుతున్న ప్రధాని మోదీ చర్యలను ప్రతిఘటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గంగుల అంజలియాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోరికాల అనుసూర్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు భవానీ పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం అందించడమే ధ్యేయం

- గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి



నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఎగ్ బిర్యానీ కార్యక్రమాన్ని ప్రారంభించి పిల్లలతో పాటు భోజనం చేస్తున్న సుహాసినిరెడ్డి

నర్సాపూర్/శివ్వంపేట/తూప్రాన్/కొండాపూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ పిల్లలకు కూడా సంపూర్ణ పోషకహారం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో 'ఎగ్ బిర్యానీ' కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మండలంలోని రెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పిల్లలతో కలిసి ఆమె భోజనం చేశారు. సీడీపీవో హేమభార్గవి, ఎంపీడీవో మధులత, సూపర్‌వైజర్ సరళ పాల్గొన్నారు. శివ్వంపేట మండలం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎగ్ బిర్యానీ కార్యక్రమాన్ని సూపర్‌వైజర్లు వసుమతి, సంతోష ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శివంపేట అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి పిల్లలు, తల్లులు పాల్గొన్నారు. అలాగే తూప్రాన్ పట్టణంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమ ర్యాలీని మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్‌రెడ్డి, ఎంఈవో డాక్టర్ పర్వతి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కొండాపూర్ మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' ప్రారంభించారు.

రేపటి నుంచి క్రికెట్ జిల్లా జట్టు ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెదక్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహణలో భాగంగా క్రికెట్ జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న సంగారెడ్డి, మెదక్ జిల్లాల క్రీడాకారులు జట్టు ఎంపికలు సంగారెడ్డి ఎంఎస్ క్రికెట్ అకాడమీలో, 14 సిద్దిపేటలోని జయశంకర్ మినీ స్టేడియంలో సిద్దిపేట జిల్లా జట్టు ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. 1.9.2006 తర్వాత జన్మించిన క్రీడాకారులు ఎంపికలకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగినవారు ఆధార్‌కార్డు, జన్మదిన ధ్రువీకరణపత్రం, రెండు పాస్ ఫొటోలతో ఉదయం 10 గంటల వరకు ఆయా ప్రాంతాలకు చేరుకోవాలని ఆయన కోరారు.

న్యూస్ బాక్స్

అంగన్‌వాడీ బడిబాట ర్యాలీ

చేర్యాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలోని ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రాలు 1,2,3,6,11 ఆధ్వర్యంలో బుధవారం అంగన్‌వాడీ బడిబాట ర్యాలీ నిర్వహించారు. రెండున్నరేళ్ల వయస్సున్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని నినాదాలు చేశారు. ఆటా, పాటా అవగాహనతో కూడిన విద్యతతోపాటు శారీరక ఎదుగులకు నిలయాలైన అంగన్‌వాడీకేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీఎస్ఎస్ హెచ్ఎం నాగమణి, ఏఎన్ఎం అమృత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు

పల్లాకు గాయంతో పరేషాన్



ఆస్పత్రిలో ఎమ్మెల్యే పల్లా సతీమణి నీలిమతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

చేర్యాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం గాయాలపాలైన నేపథ్యంలో చేర్యాల ప్రాంత బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, పల్లా అభిమానులు ఆందోళనకు గురయ్యారు. కాళేశ్వరం కమీషన్ విచారణకు మాజీ సీఎం కేసీఆర్ హాజరయ్యేందుకు సన్నద్ధమైన నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామువరకే నియోజకవర్గ పరిధిలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల పార్టీ ముఖ్య నేతలను ఫాంహౌజ్‌కు రప్పించి ఉనికి చాటుకున్నారు. కానీ ఎమ్మెల్యే పల్లా అంతలోనే ఫాంహౌజ్‌లోని బాత్రూంలో జారిపడి గాయాలపాలవడంతో ఆందోళన చెందారు. చికిత్స నిమిత్తం సోమాజిగూడ యశోదఆస్పత్రికి తరలించిన నేపథ్యంలో ఆయా మండలాల నాయకులు, అభిమానులంతా కలిసి తరలివెళ్లారు.

అనాజీపూర్‌లో 150 దరఖాస్తులు

రాయపోల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం అనాజీపూర్‌లో బుధవారం అధికారులు భూభారతి సదస్సు నిర్వహించారు. ఈ గ్రామంలో సమస్యలు పరిష్కరించాలంటూ అత్యధికంగా 150 వరకు దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ కృష్ణమోహన్ తెలిపారు. ఇప్పటివరకు మండలంలో ఈ గ్రామంలోనే రికార్డు స్థాయిలో దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.

నేడు రాయపోల్‌లో విద్యుత్ అంతరాయం

రాయపోల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం ఉదయం రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు 33 కేవీ లైన్ల కింద ఉన్న చెట్లు తొలగించనున్నందున విద్యుత్‌ను నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా మార్చడమే లక్ష్యం

గజ్వేల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని ఆదర్శంగా మార్చడమే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య అన్నారు. గజ్వేల్ పట్టణంలోని పలు వార్డులలో వంద రోజుల కార్యక్రమంలో భాగంగా నాలాలను శుభ్రం చేయించడం, పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఎడ్యూకేషన్ హబ్‌లోని రోడ్లను, గదులను శుభ్రం చేయించడాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ రవిందర్, మేనేజర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన భవనం సిద్ధం

- రూ. 3.50 కోట్లతో నిర్మాణం
- తీరనున్న విద్యార్థినుల ఇబ్బందులు
- నేడు ప్రారంభించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



అక్కన్నపేట మండల కేంద్రంలో కేజీబీవీ నూతన భవనం

అక్కన్నపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల సౌకర్యార్థం అధునాతన వసతులతో కస్తూర్బాగాంధీ విద్యాలయం నూతన భవనం ప్రారంభానికి సిద్ధమైంది. అక్కన్నపేట మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం రూ, 3.50 కోట్లతో నూతనంగా నిర్మించిన ఈ పాఠశాల భవనాన్ని గురువారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ప్రారంభించబోతున్నారు. ప్రస్తుతం కేజీబీవీ పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతుండడంతో సౌకర్యాలు సరిపడా లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో గత ప్రభుత్వం 2021 సెప్టెంబర్‌లో నూతన భవన నిర్మాణానికి నిధులను మంజూరు చేసి మాజీ మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ బిల్లులు రావడం లేదని కారణంతో పనులు నిలిపివేశాడు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ చూపి బిల్లులు ఇప్పిస్తానని కాంట్రాక్టర్‌ను ఒప్పించి పనులు వేగంగా పూర్తి చేయించారు. విద్యార్థినుల సౌకర్యార్థం నూతన భవనంలో విద్యుత్‌దీపాలు, ఫ్యాన్లు, తాగునీటి నల్లాలు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, విశాలమైన తరగతి గదులు, లైబ్రరీ, ల్యాబ్‌తోపాటు సకల వసతులను కల్పించారు.

ఈ పాఠశాలలో 200 సీట్లు ఉండగా వసతులు లేకపోవడంతో 140 మంది విద్యార్థినులకు మాత్రమే అడ్మిషన్‌లు ఇచ్చారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్య కూడా ప్రారంభిస్తున్నారు. కోట్లాది రూపాయలను ఖర్చు చేసి అన్ని హంగులతో కస్తూర్బాగాంధీ నూతన భవనంలో అన్ని వసతులు ఉండటంతో విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పట్టా పాసు బుక్కులు ఇవ్వాలి



తహసీల్దారు దిలీప్‌నాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

చేర్యాల, జూన్11 (ఆంధ్రజ్యోతి) : సాదాబైనామా కొనుగోలు భూములకు పట్టాదారు పాసుబుక్కులు అందించాలని కోరుతూ సీపీఐ నాయకులు బుధవారం చేర్యాల తహసీల్దారు దిలీప్ నాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా చేర్యాల పట్టణంలోని రైతు వేదిక వద్ద బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో విన్నవించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు అందె అశోక్ మాట్లాడుతూ చాలాసంవత్సరాలుగా వేలాదిమంది రైతులు భూ సమస్యల పరిష్కారం కోసం ఎదురు చూస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ రైతు సమస్య ను పూర్తిస్థాయిలో పరిశీలించి నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని కోరారు. సాదాబైనామ కాగితాలతో కొనుగోలుచేసిన భూములలో రైతులు కబ్జాలోఉంటూ పంటలు పండించుకుంటున్న వారికి వెంటనే పట్టాలు ఇవ్వాలని, అలాగే గతంలో నిరుపేదలకు పంపిణీ చేసిన భూముల్లో పట్టాలు లభించనివారికి పట్టా సర్టిఫికేట్లు జారీచేసి పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు. గతంలో రైతులు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ కలిగి ఉండి మ్యూటేషన్ కాకుండా పెండింగ్ లో ఉన్న రైతుల సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలి:ఎంఈవో



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న హుస్నాబాద్ ఎంఈవో బి. మనీల

కొండపాక/దౌల్తాబాద్/హుస్నాబాద్‌రూరల్/మద్దూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కొన్ని మండలాల్లో బుధవారం మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు శుచి, రుచితో పాటు పరిశుభ్రమైన నాణ్యతతో కూడిన పౌష్టికరమైన ఆహారాన్ని అందించాలని మద్దూరు ఎంఈవో వరదరాజు భోజనతయారీ నిర్వాహకులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మాడల్‌స్కూల్‌లో మధ్యాహ్నభోజన తయారీ నిర్వాహకులతో పాటు ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని హుస్నాబాద్ మండల విద్యాదికారి బి. మనీల ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు సూచించారు.మధ్యాహ్న వంట కార్మికులు విద్యార్థులకు పరిశుభ్రతతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని దౌల్తాబాద్ మండల విద్యాధికారి గజ్జల కనకరాజు అన్నారు. నేడు పాఠశాలలు పున ప్రారంభం కావడంతో అన్ని పాఠశాలల ఆవరణంలో పరిశుభ్రంగా తీర్చిదిద్దలని శానీటరీ లకు,వంట కార్మికులకు,ఉపాధ్యాయులకు సూచించారు.

మిషన్ భగీరథను పట్టించుకోకపోతే ఎలా..?



వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

హుస్నాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని అక్కన్నపేట రోడ్డులో మిషన్ భగీరథ నీరు పైపుల నుంచి ప్రతి రోజు వృథా పోతున్నా మున్సిపల్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. కొన్ని ఇంటి కనెక్షన్ల పైపులు మురికి కాలువల్లో వేయడంతో నీరు వృధాగా పోవడమే కాకుండా బంద్ అయినప్పుడు అందులోని కలుషిత నీరు పైపుల్లోకి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

పకడ్బందీగా రెవెన్యూ సదస్సులు

సిద్దిపేట రూరల్,జూన్ 11(ఆంధ్రజ్యోతి); గ్రామాల్లో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్ అధికారులను అదేశించారు. బుధవారం నారాయణరావుపేట మండలం గోపులాపూర్ గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవిన్యూ సదస్సును సందర్శించారు. అనంతరం రేషన్ దూకాణంలో బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ధరఖాస్తుల పక్రియ, దరఖాస్తుల అన్ లైన్ నమోదు విదానం పై ఇన్‌చార్జి తహసిల్థార్ మాధవిని అడిగి తెలుసుకున్నారు.

మా పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకే..

● మహిళా సంఘాల హామీ

మద్దూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబర్తి గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపిస్తామని హామీ ఇచ్చారు. బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో కార్యక్రమంలో భాగంగా గ్రామైఖ్య సంఘాలతో గ్రామపంచాయతీలో పంచాయతీ సెక్రటరీ మాధవ్ జాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బడిబాట సమీక్షా సమావేశంలో ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు బాకీ చంద్రభాను పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా నోట్‌బుక్స్, టెస్ట్ బుక్స్‌తో పాటు రెండు జతల యూనిఫామ్స్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలో వేలల్లో ఫీజులు చెల్లించి ఆర్థిక ఇబ్బందుల పాలు కావొద్దన్నారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి మహిళా సంఘాలు తోడ్పాటును అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామైఖ్య సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడి పాట ఆవిష్కరణ

చేర్యాల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, తల్లి దండ్రులు తమ కష్టార్జితాన్ని అనవసరంగా ఖర్చు చేయొద్దని చేర్యాల మండల విద్యాశాఖాధికారి రచ్చ కిష్టయ్య అన్నారు. చేర్యాల మండల కేంద్రానికి చెందిన కవి, కడవేర్గు జడ్పీఎస్ఎస్ తెలుగు ఉపాధ్యాయుడు గుళ్ళపల్లి తిరుమల కాంతి కృష్ణ రచించిన సర్కారుబడిపాటను బుధవారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఆయన ఆవిష్కరించారు. చేర్యాల రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యతోబాటు దుస్తులు, పాఠ్యపుస్తకాలు మధ్యాహ్న భోజనం ఉచితంగా లభిస్తాయని, పిల్లల సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందన్నారు. ఆయా విషయాలను వివరిస్తూ కాంతికృష్ణ చక్కని సాహిత్యంతో పాటను అందించడం అభినందించ దగిందన్నారు.

విద్యుత్ స్తంభాలకు లైట్లు అమర్చిన పంచాయతీ కార్యదర్శి

● పారిశుద్ధ పనులూ క్లియర్



విద్యుత్ స్తంభాలకు అమర్చిన లైటు

సిద్దిపేట అర్బన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): 'ఊరు బేజారు' అనే శీర్షికతో ఈ నెల 6న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో స్పందించిన సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల పంచాయతీ కార్యదర్శి గ్రామ పరిధిలోని సమస్యలను గుర్తించి విద్యుత్ స్తంభాలపై లైట్లు అమర్చారు. అలాగే గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మోరీలను క్లీన్ చేయించారు. గత కొంతకాలంగా నిధుల కొరతతో విద్యుత్ స్తంభాలపై లైతు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న గ్రామస్తుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనంతో లైట్లు అమర్చి పారిశుద్ధ్య పనులు కూడా క్లియర్ కావడంతో గ్రామస్తులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముగిసిన విద్యార్థి ప్రతినిధుల ఎన్నికలు

వర్గల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులలో ప్రజాస్వామ్య విలువల పట్ల అవగాహణ కల్పించడం కోసం విద్యార్థి ప్రతినిధుల ఎంపిక ఎన్నికలు నిర్వహించినట్లు జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. బుధవారం నవోదయ విద్యాలయంలో విద్యార్థి ప్రతినిధుల ఎంపిక ఎన్నికలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలను విద్యార్థి దశలోనే అలవర్చుకునే విధంగా చేయడం కోసం ఈ ఎన్నికలు మొదటి సారి జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించామన్నారు.

బీఆర్‌కే భవన్‌కు తరలివెళ్లిన బీఆర్ఎస్ నాయకులు

గజ్వేల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట హాజరవుతున్న సందర్భంగా గజ్వేల్ బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున బీఆర్‌కే భవన్‌కు తరళివెళ్లారు. ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవ రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు హైదరాబాద్‌కి తరళారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ, కేవలం కేసీఆర్‌ను అభాసుపాలు చేయడానికే కాంగ్రెస్, బీజేపీ నాయకులు కుమ్మక్కై విచారణల పేరిట కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. అబద్ధపు ప్రచారం చేయడం, ప్రతి విషయాన్ని మసి పూసి మారేడుకాయ చేస్తూ కాలయాపన చేస్తున్నారన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

వర్గల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భం, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వర్గల్ మండలం నాచారం గ్రామంలో బుధవారం మండల పార్టీ అధ్యక్షుడు బొల్లిపల్లి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వంలో కొత్త పథకాలు, సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ సబ్‌కా ప్రయత్న సబ్‌కా విశ్వాస్ అనే మంత్రంతో కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు ప్రతి గ్రామంలో బూత్ అధ్యక్షులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

గౌడ కమ్యూనిటీ హాల్‌కు నిధులిస్తా

హుస్నాబాద్‌రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండల గౌడ కమ్యూనిటీ హాల్‌కు నిధుల మంజూరు చేస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ హామి ఇచ్చినట్లు పోతారం(ఎస్) మాజీ సర్పంచ్ బత్తిని సాయన్న రిటైర్డ్ కంట్రోలర్ బూర వెంకన్న తెలిపారు. బుధవారం హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి కమ్యూనిటీ హాల్‌కు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

నీటి కోసం మహిళల ధర్నా



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

మర్కుక్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం వరదరాజపూర్ గ్రామంలో బుధవారం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు, మహిళలు మాట్లాడుతూ వరదరాజ్‌పూర్ గ్రామంలో దాదాపు రెండు నెలలుగా మిషన్‌భగీరథ నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వెంటనే అధికారులు స్పందించి గ్రామంలో నీటి సరఫరా పునరుద్ధరించాలని కోరారు. ఈ విషయం తెలుసుకున్న మండల ఎంపీడీవో, ఎంపీవో ప్రభుత్వ అధికారులు నీటి సమస్య వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ధర్నా విరమించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 17 మందికి జరిమానా

గజ్వేల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన 17మందికి జరిమానా విధిస్తూ గజ్వేల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ తీర్పును వెలువరించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ మురళీ తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని అయా చౌరస్తాలో ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 17మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని తెలిపారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపరుచగా, విచారణ జరిపిన న్యాయమూర్తి 17మందికి రూ.17వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని తెలిపారు.

ఆర్టీసీ వన్ డే టూర్ ప్యాకేజీ

గజ్వేల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో వన్‌డే టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు డిపో మేనేజర్ పావన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట జిల్లాలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలైన నాచారం, వర్గల్, కొముర‌వెల్లి, కోమటి చెరువు వీక్షించడం కోసం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో ప్రత్యేకంగా కేవలం రూ.360లు చెల్లించి ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు స్పెషల్ సర్వీస్ బుక్ చేసుకునేందుకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ అవకాశం ఈ నెల 15 నుంచి 27వరకు వరకు అందుబాటులోకి ఉంటుందని, కుటుంబ సభ్యులు, బంధువులతో వెళ్లాలనుకుంటే ముందుగానే బస్ సీట్ బుక్ చేసుకోవాలని సూచించారు. 9959226270, 9347252659, 7382829824 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చేర్యాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : బస్‌పాస్, బస్‌చార్జీల ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్‌చేస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం చేర్యాల ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ధరలపెంపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించు కోవాలన్నారు. ఉచితబస్ పథకంపెట్టి విద్యార్థులపై భారంమోపడం తగదన్నారు. విద్యార్థులపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఉచితంగా బస్‌పాస్‌లను అందించాలని కోరారు.

ఇంటర్ ఒకేషనల్ కోర్సులకు భవన సమస్య

- కేజీబీవీకి ఒకేషనల్ కోర్సులు మంజూరు
- బాలికల గురుకులంలో తరగతులు

రాయపోల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే ఇబ్బందిగా కొనసాగుతున్న బాలికల గురుకుల పాఠశాల. ఇందులోనే ఇంటర్ క్లాసులు ప్రారంభించాలంటే మరింత ఇబ్బందులు ఏర్పడక తప్పవు. ఇలాంటి పరిస్థితి రాయపోల్ కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలకు ఏర్పడింది. వివరాల్లోకి వెళితే... ఇటీవల ప్రభుత్వం రాయపోల్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి రెండు ఇంటర్ ఒకేషనల్ కోర్సులు మంజూరు కాగా ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులో 40 సీట్లు ఎమ్మెల్టీ కోర్సులో 40 సీట్లు భర్తీ చేయనున్నారు. ఇప్పటికే ఇంటర్ ఒకేషనల్ కోర్సుల్లో కొంతమంది విద్యార్థినులు అడ్మిషన్‌లు పొందారు. ఈ కోర్సులు కూడా పాఠశాలతో పాటు నేడే ప్రారంభించాల్సి ఉంది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ రాయపోల్‌లోని కేజీబీవీ ఇప్పటికే అద్దె భవనంలో కొనసాగుతున్నది. ఈ భవనంలో ఉన్న గదుల్లో ఐదింటిని తరగతి గదులుగా, ఒక గదిని కార్యాలయంగా, ఒక గదిని స్టాఫ్ రూముగా, ఒక గది సిక్ రూమ్, ఒక గది స్టోర్ రూమ్, ఒక గది కిచెన్‌గా వాడుకుంటున్నారు. ఇందులోనే ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సులు ప్రారంభించాలంటే కనీసం మరో అయిదు గదులు అవసరమవుతాయి. రాయపోల్ కేజీబీవీకి ప్రభుత్వ భవనం మంజూరు చేసి ఏళ్లు గడుస్తున్నా నిర్మాణం నత్తనడకనే సాగుతున్నది. ఈ భవన నిర్మాణం పూర్తయ్యే వరకు విద్యార్థులు, అధ్యాపకులకు ఇబ్బందులు తప్పవు.

ప్రత్యామ్నాయ గదుల కోసం ప్రయత్నిస్తున్నాం



ప్రస్తుతం కేజీబీవీ నడుస్తున్న భవనంలో ఇంటర్ ఒకేషనల్ తరగతులు నిర్వహించడం కష్టంగా ఉంది. ప్రత్యామ్నాయ గదుల కోసం ప్రయత్నిస్తున్నాం. రెండు మూడు రోజుల్లో గదుల సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తాం. గురువారం లాంఛనంగా ఒకేషనల్ కోర్సులు ప్రారంభం అవుతాయి. రెండు మూడు రోజుల్లో అధ్యాపకుల నియామకం పూర్తి చేయగానే పూర్తి స్థాయిలో తరగతులు ప్రారంభమవుతాయి.

-సత్యనారాయణరెడ్డి ఎంఈవో, రాయపోల్

స్వీపర్‌ను సన్మానించిన ఎంఈవో



నర్సయ్యను సన్మానిస్తున్న ఏంఈవో రమేష్

కొమురవెల్లి, జూన్11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరాయపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో దాదాపు గత 30 సంవత్సరాలుగా స్వీపర్‌గా పనిచేస్తున్న నర్సయ్య(75)ను బుధవారం ఏంఈవో బొమ్మగోని రమేష్ పాఠశాలలో జరిగిన సమావేశంలో సన్మానించారు. ఈ సందర్భంగా నర్సయ్య పాఠశాలకు చేస్తున్న సేవలను కొనియాడారు.

బీజేపీకి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు బద్ధ వ్యతిరేకం

సిద్దిపేట క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పది ఏళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ, ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీకి బద్ధ వ్యతిరేక పార్టీలు అని ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి తెలిపారు. ఎన్నికలలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయడం లేదని ఆయన విమర్శించారు. బుధవారం కేంద్ర ప్రభుత్వం 11 ఏళ్ల పాలనపై సిద్దిపేట జిల్లా బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి,బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జి.వెంకట్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి రాకముందు అన్ని శాఖలలో స్కాంలు జరిగాయని విమర్శించారు. మోదీ ప్రధాని అయ్యాక మన దేశ ఆర్థిక స్థితిని 12వ స్థానం నుంచి 4వ స్థానానికి తెచ్చినట్లు కొనియాడారు.

'శిథిలం '.. పదిలమేనా?

(5వ పేజీ తరువాయి)



పాలిథిన్ కవరు పరుచుకున్న పెంకిటిల్లు

దర్మాజీపేట, లచ్చపేట, చెల్లాపూర్, అలాగే పలు వార్డులో పాత ఇళ్లు ఎక్కువగా ఉన్నాయి. వీటిని కూల్చివేసేందుకు అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ ఇంటి యజమానులు స్పందించడం లేదు. నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. స్థానికంగా నివాసం లేని, పాడుబడిన ఇళ్లు, పాత భవనాలను మాత్రమే అధికారులు గతంలో కూల్చగలిగారు. అయితే, ఒక పక్క కూలిపోయినా, మరోపక్క అదే ఇంట్లో ఉంటామని మొండికేసిన వారు లేకపోలేదు. పాతబడినవని తమ ఇళ్లను కూల్చేస్తే, నివాసముండటానికి ప్రత్యామ్నాయం లేకుండా పోయిందని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల గందరగోళం

ఐదు మున్సిపాలిటీల్లో కేవలం వార్డుకు పది నుంచి పదిహేను ఇందిరమ్మ ఇళ్లకు మాత్రమే శిథిలావస్థలో ఉన్న ఇళ్ల స్థానంలో నిర్మించుకోవడానికి ప్రతిపాదనలు పంపారు. కొన్నిచోట్ల అత్తెసరు కేటాయింపులు ఉంటే, మరికొన్ని చోట్ల రాజకీయ జోక్యంతో శిథిలావస్థలో లేని ఇళ్లకు, ఇంటి స్థలాలు, పెరటి స్థలాలు ఉన్నవాటికి కూడా ప్రతిపాదనలు పంపారు. అత్యవసరంగా కూలిపోయే ఇళ్లకు మంజూరు చేయాల్సిన అధికారులు ఏడాది క్రితం జరిపిన సర్వేకు ఇపఁటివరకు రూపకలఁన జరగలేదు. దీంతో ఈ వర్షాకాలానికి శిథిలావస్థలో ఉన్న ఇళ్ల స్థానంలో ఇందిరమ్మ ఇళ్లకు మోక్షం లేకుండా పోయింది. ఇది నివాసితుల కష్టాలను మరింత పెంచుతోంది.